# గుమ్మడు పాట

రాణించు ముత్యాల రావిరేకయు బొట్టు - కురు వెంద్రుకల నడుమ గునిసియాడ
బాగైన ముత్యాల పౌజు కమ్మలజోడు - చెక్కిళ్ళపై మెరుగు సేయుచుండ
వక్ష స్థలంబున వరుస పక్షులు రెండు - ఒప్పుగా తమతోన నొప్పుచుండ
రంగారు బంగారు రచనా కలాపంబు - నసియాడు వెన్నడుము పసలుచూప
మేటి పటుత్రాడు కవ్వానమించ జుట్టి - వల్లెవాటుల కొంగు ఉయ్యాలలూగ
కరమునను కంకణంబుల రవముసెలగా - తరుణి యొయ్యారమున పెరుగు చిలుకుచుండె.

కలికి కంఠపుసరులు చక్కగ - గొప్ప ముత్యపుసరులు జారగ
కలికి కరమున కంకణాదులు - కలసి మ్రోవగను
గరివి కెదురుగ పెరుగుదించెను - కడవ స్తంభం మొదట నిలిపెను
కరమునను దట్టించి కవ్వము - ఇంతిచే బూనెగ.

ఘుమ్మ ఘుమ్మన పెరుగు తరచగ - కోరి విని ప్రార్థించి కృష్ణుడు
అమ్మ వెన్నాయనుచు కవ్వము - నణచి పట్టగనూ
నమ్మరా కృష్ణమ్మ పెరుగులో - నడుమ గుమ్మడు తిరుగులాడును
నమ్మకున్నను ఘుమ్మ ఘుమ్మను - నాదమిటు వినుమీ ॥కృష్ణా గుమ్మడిదుగో॥

వామహస్తము నణచి పాదము - వసుధ మీదికి కాలు యెత్తుకు
భూమి కదలగ నవయవమ్ములు - బొజ్జ కదలగనూ
కోమలీకంబైన చక్కని - గునిసియాడెడి నడుము వంచుకు
ప్రేమ లెన్నుచు చెయ్యి చాపెను - పెరుగు తరచగనూ॥

కాటబోయిన వారి పాపడు - కడవలోపల చెయ్యి ముంచెను
తూటుపొడిచీ కరచె గుమ్మడు - తొలగి పోవగనూ
మాటలేటికి విడుము కవ్వము - అన్న నీకును వెన్న బెట్టెద
యేటికీ ఇందున్న గుమ్మడు - యెగిరి కరచెడినీ ॥కృష్ణా గుమ్మడిదుగో॥

గుమ్మడేడే గోపిదేవి - గుమ్మడేడే కన్నతల్లి
గుమ్మడిని పొడచూపగదవే - అమ్మ గోపెమ్మా ॥గుమ్మడేడే॥

మ్రుచ్చు తనమున వేదములుగొని - తెచ్చి వెరచుచు జలధిలోపల
జొచ్చియున్నా వాని వెంబడి - జొచ్చి వెనుదగిలి
మత్స్యమై సోమకుని ద్రుంచితి - మొదటి చదువులు బ్రహ్మకిచ్చితి
అటుయాంబు గుమ్మడనియెడి - మాట నేనెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

సురులు నసురులు జలధి తఱచగ - సరగునను భూధరము కృంగగ
అల్లసురవరులెల్ల పొగడగా - వారి కిష్టముగా
గిరికి కుదురుగ కూర్మమైతిని - క్రిందిలోకమునందు గుమ్మడి
తరచుగా నొకమాటకైనను - తరుణి నే నెరుగ ॥అమ్మా గుమ్మడేడే॥

చారు భూమి చరాచరమ్ములు - చంకబెట్టుకు హైమనేత్రుడు
వారి నిధిలో జొచ్చి నంతట - వాని వెనుదగిలి
కోరి వరాహరూపమైతిని - రక్కసుని రణభూమి జంపితి
వారి భూములలోన గుమ్మడి - పేరు నే నెరుగ ॥అమ్మా గుమ్మడేడే॥

జగములన్నియు విష్ణుమయమని - చదువు బాలుండిందు గలడన
పరుగునను దట్టించి స్తంభము - పగులవేయగనూ
నగము మృగమై హేమకశ్యపు - చంపి దానవసుతుని గాచితి
మగువరో అందున్న గుమ్మడి - మాట నేనెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

వడుగు బ్రాహ్మణ వేషముననే - బలిని అడిగితి దానమిమ్మని
పుడమిలో మూడడుగులిచ్చెను - పొంగి వేడుకతో
అడుగులను బ్రహ్మాండ భాండము - అంతటను నే నపుడు నిండితి
అడుగు క్రిందను గుమ్మడనియెటు - అరసి నే నెరుగ ॥అమ్మా గుమ్మడేడే॥

వరుస నెరుగక కార్తవీర్యుడు - వచ్చి యా సురధేనుకైగొని
పరగగా జమదగ్ని జంపిన - పగకు నే నపుడూ
వరుస నిరువది యొక్క మారులు - వెంటబడి భూపతుల జంపితి
వైరి భూములలోన గుమ్మడి - పేరు నే నెరుగ ॥అమ్మా గుమ్మడేడే॥

పరగగా రాక్షసుల బాధకు - విబుధ దేవతలెల్ల శరణని
కోర దశరథ రాజసుతుడై - యవని జన్మించీ
జలధి బంధనజేసి రావణు - జంపితీ రణభూమిలోపల
బలిమిగల యా గుమ్మడనియెదు - మాట నే నెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

సంతసమ్మున రామకృష్ణులు - సదయులై రేపల్లె వాడలో
యింతులకు పదియారు వేలకు - ఇష్టమొనరించీ
కుంతి సుతునకు సారథై తిని - కురుబలమ్ముల నణచుచోటను
మంతనమ్మగ గుమ్మడనియెడి - మాట నే నెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

యుద్ధయోగము చేయు చోటను - పణతులను చెరుపంగవలెనని
వృద్ధ బ్రాహ్మణ వేషముననే - వేడ్కలమరగనూ
యుద్ధమున రాక్షసుల చంపితి - ఉత్పత్తిల్లగ భూమి దెచ్చితి
యుద్ధ యోగమునందు గుమ్మడి - చోద్యమే నెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

మర్మమెరుగక కలియుగమ్మున - మత్తులై నీచులను మించియు
నిర్మలాశ్వము నెక్కి వారల - నణచి మోదముతో
ధర్మదేవతలనెడి రాజుల - ధరణిలో నిలుపంగవలెనని
ధర్మయుద్ధములోను గుమ్మడి - తెరవు నే నెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

చిత్తమును బహుచందములుగా - చంద్రకళయును జలసమస్తము
సప్తరాత్రులు వుంటినే - వటపత్ర శయనమునా
హరి యెగతియని అక్షయంబుగ - నారదాదులు శ్రుతులు చేయగ
యోగమార్గమునందు గుమ్మడి - పేరు నే నెరుగ ॥అమ్మా గుమ్మడేడే॥

మేదినియు మిన్నొక్కటగుచు - మెండు జలముల దిశలు మునుగగ
మోదమలరగనుంటినే నా - మొదటి రూపమునా
ఆదరమ్మున తిరిగి యంతట - అమ్మ నే జగమెల్ల నుండితి
వెదకితిని జగమెల్లవేమరు - గుమ్మడిని యెరుగా ॥అమ్మా గుమ్మడేడే॥

## స్త్రీల పౌరాణికపు పాటలు

ఇందుగలడా గుమ్మడంటివి - ఎందుగలడో చూడుమాయని
వందనంబిడివేగ తన తిరు - వాక్కు తెరవగనూ
నందనందను నోటిలోపల - నాతిపొడగనె చరాచరంబులు
చంద్ర సూర్యులు మొదలుగాగల - సకల దేవతలూ

వెరువవలెనని గుమ్మడంటిని - వెరచితిని తెరువాకు మూయుము
చిరుతలను వెరపించు చందము - చేస్తినో తండ్రీ
కన్న బలిమిని గుమ్మడంటిని - కరుణ జూడుము దేవమణినను
కరుణతో హరిదాసు నేలిన - కాకుళాధీశా॥

---